క్లుప్తంగా

బీఎస్పీ నాయకుల నిరసన

అచ్చంపేట రూరల్: టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేయడం సరైంది కాదని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బీసమొళ్ల యోసేఫ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రామన్న, కృష్ణ, రాము, వెంకటయ్య, జయరాం, శేఖర్, రామకృష్ణ, సైదులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీఎస్పీ నాయకుల మధ్య తోపులాట

నాగర్‌కర్నూల్‌రూరల్: మండల పరిధిలోని తూడుకుర్తిలో బీఎస్పీ, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. బీఎస్పీ పార్టీ జెండా దిమ్మెను రోడ్డుకు అడ్డంగా కట్టారని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గొడవకు దిగినట్లు తెలిసింది. అయితే ఆ పార్టీ జెండాను, దిమ్మెను కూల్చివేయాలని బీఆర్‌ఎస్ కార్యకర్తలు బీఎస్పీ కార్యకర్తలతో గొడవపడినట్లు తెలిపారు. ఇలా ఇరువురి పార్టీ నాయకుల మధ్య కాసేపు తోపులాట జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

బాల్య వివాహాలు చేయొద్దు

లింగాల: పిల్లలకు బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అప్పాయపల్లిలో ఓ బాలికను బడికి పంపడం లేదనే విషయం తెలుసుకున్న సీడీపీఓ బృందంతో కలిసి బాలిక ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గిరిజ, అంగన్‌వాడీ టీచర్లు, మాజీ ఉప సర్పంచ్ పర్వతాలు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని టంగాపూర్ కాలనీలో భీమలింగేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలతో పాటు సామూహిక హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

పాడి పశువులకు వైద్య శిబిరం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ముక్కిడిగుండం, మొలచింతలపల్లిలో అటవీశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఉన్న పాడి పశువులకు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైరస్ సోకకుండా అటవీ సమీపంలో ఉన్న పశువులను కాపాడాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు అటవీశాఖ రేంజర్ శరత్ చంద్రారెడ్డి తెలిపారు. పశువైద్య శాఖ అధికారులచే పశువులకు టీకా, వ్యాక్సిన్ మందులను వేయించారు. ఆయా గ్రామాల ప్రజలు పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి యాదగిరి, ఫారెస్టు సిబ్బంది, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.


ప్రతి పాఠశాలకు 'అన్నపూర్ణ' రాగిజావ

పెంట్లవెల్లి: మండలంలోని ప్రతి పాఠశాలకు సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మధుసూదన్ సహకారంతో బెల్లంతో కూడిన రాగిజావను పంపిణీ చేస్తున్నట్లు ట్రస్ట్ సభ్యుడు అర్జున్‌గౌడ్ తెలియజేశాడు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని గోపులాపురం పాఠశాలలో సర్పంచ్ మేడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు బెల్లం రాగిజావను ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాగులు, ఉపాధ్యాయులు కృష్ణయ్య, భరత్, సాదిక్, ప్రతాప్‌సింగ్, అలివేల తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు 20 వరకు పొడిగింపు

లింగాల: సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు ఈనెల 20వ తేది వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ వినోద్‌ఖన్నా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 23న అర్హత పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు అవగాహన



తాడూరు: మండలంలోని తుమ్మలసూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు వివిధ అంశాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. పాలెం కేవీకే కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన తరగతి గదిలో ఉండే విధానం వంటి వివిధ అంశాలపై విద్యార్థులతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుడు ప్రమోద్‌కుమార్ విద్యార్థులకు పాఠశాల పరిసరాలు, విద్యార్థుల వివరాలు, వివిధ అంశాలను వారికి తెలియజేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు



సమాఖ్య సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు

మన్ననూర్: మహిళలు స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు సూచించారు. శుక్రవారం అమ్రాబాద్ మండల కేంద్రంలో మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యుడు చంద్రకళ, శారద అధ్యక్షతన కార్యాలయం ఆవరణలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి అంశంపై పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలను పూర్తి స్థాయిలో సమాఖ్య సభ్యులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణం తీసుకున్న వారు క్రమం తప్పకుండా తిరిగి చెల్లించే వారికి వడ్డీ లేని రుణాలు పొందే అవకాశాలు ఉంటుందని అన్నారు. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్ ద్వార గ్రామీణ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా 35 శాతం సబ్సిడీతో రూ.10 లక్షల వరకు రుణాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఆర్డీఓ లక్ష్మీనారాయణ, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ రామచంద్రుడు, డీపీఎంలు అరుణ, శ్రీనివాసులు, వెంకటేష్, నర్సింహులు, సుధాకర్, లక్ష్మయ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పప్పు ధాన్యాల పంటలపై దృష్టి సారించండి



రైతులకు పంపిణీచేస్తున్న ఏవో, ఏఈఓ

లింగాల: వేసవిలో పప్పు ధాన్యం పంట లాభదాయకమని వ్యవసాయ శాఖ అధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని అంబట్‌పల్లి రైతు వేదికలో జాతీయ ఆహార భద్రత పథకం 2022-23లో భాగంగా పప్పు ధాన్యం పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవిశంకర్, ఉప సర్పంచ్ జనార్దన్, సింగిల్ విండో మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏఈఓలు శివానందం, శ్రీనిధి, రైతులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండలంలోని ఖానాపూర్‌కి చెందిన రైతులకు మండల వ్యవసాయశాఖ అధికారులు జీరో సబ్సిడీలో మినుములు అందజేశారు. శుక్రవారం ఖానాపూర్‌కి చెందిన ఏఈఓ శారద జాతీయ ఆహార భద్రత పథకం -2023 కింద వీబీఏ-8 రకం విత్తనాలను పంపిణీ చేశారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం మినుము పంట సాగుపై వ్యవసాయాధికారిణి సునీత, ఏఈఓ మంజుల అవగాహన కల్పించారు. రైతు బంధు కోఆర్డినేటర్ కట్టా గోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని కుడికిల్లలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహారభద్రత పథకం 2022-23లో భాగంగా పప్పు ధాన్యాల పంటలపై వ్యవసాయ అధికారులు గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి నాగరాజు, సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ కోండ్ర బిచ్చయ్య, ఏఈఓ రాముడు, టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వెంకటేశ్వరావు రైతులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: మండలంలోని ఐనోల్‌కు చెందిన రేషన్ డీలర్ మనెమ్మపై కేసు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్ తెలిపారు. రేషన్ బియ్యం ఇవ్వడం లేదని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రేషన్ షాపును తనిఖీ చేయగా 4క్వింటాళ్ల 30 కేజీల బియ్యం అదనంగా ఉన్నాయి. రేషన్‌షాపును సీజ్ చేస్తున్నామని, హాజీపూర్‌కు చెందిన డీలర్‌కు బాధ్యతలు అప్పగించామని రవికుమార్ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం అనిల్‌కుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో భోజన సమయంలో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వంట నిర్వాహకులకు నాణ్యమైన వంట సామగ్రిని ఉపయోగించి మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అదేవిధంగా పాఠశాల ఆవరణ, పరిశుభ్రంగా ఉండేవిధంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయుల అధికారుల రిజిస్టర్‌లను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

ముమ్మరంగా 'కంటి వెలుగు'



కల్ములోనిపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని కల్ములోనిపల్లిలో కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీడీఓ వెంకటయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మధ్యతరగతి కుటుంబాల కోసం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి భూపాల్, పంచాయతీ కార్యదర్శి నాగేష్, రవి, వెంకటయ్య, చెన్నకేశవులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలకపల్లి: కంటి వెలుగును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గౌరెడ్డిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను సస్పెండ్ చేయాలి

కల్వకుర్తిరూరల్: తెలంగాణ ఉద్యమంలో ప్రధాన నినాదమైన నియామకాల కోసం రాష్ట్రంలో నిరుద్యోగులు ఉద్యోగాల కోసం 7 ఏళ్లుగా ఎదురు చూశారని బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. ఎట్టకేలకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లు జారీ చేసి పరీక్షలను సక్రమంగా నిర్వహించలేక పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను వెంటనే సస్పెండ్ చేసి, పరీక్ష రాసిన నిరుద్యోగులందరికి రూ.లక్ష చొప్పున నిరుద్యోగ భృతి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

మామిడి రైతులను ఆదుకోవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కోడేరు: మామిడి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ మల్లికార్జునరావుకు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 22వేల ఎకరాల మామిడి తోట ఉందని, ఎకరాకు రూ.30వేల చొప్పున పెట్టుబడి పెట్టామని, రాత్రి వీచిన ఈదురు గాలులు, వర్షానికి మామిడి కాయలు నేలరాలాయని అన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని సమక్షంలో జిల్లా వ్యాప్తంగా మామిడి రైతులతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. కార్యక్రమంలో రైతుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, రమేష్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వెల్దండ: మండల పరిధిలోని చెదురుపల్లికి చెందిన కొమ్ము సాలయ్య గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. శుక్రవారం మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయికుమార్, తిరుపతయ్యగౌడ్, అంజయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

కల్వకుర్తిరూరల్: పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని లింగసానిపల్లికి చెందిన భీమయ్యకు రూ.14వేలు, వెల్దండకు చెందిన తాగూర్‌కు రూ.21వేల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎద్మ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, వైస్ ఎంపీపీ గోవర్దన్, వెల్దండ జెడ్పీటీసీ విజితా రెడ్డి, సర్పంచ్ భూపతిరెడ్డి, రాంపర్వతాలు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వేపూరులో లబ్ధిదారులకు రూ.48 వేల సీఎం సహాయనిధి చెక్కును మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గోవర్దన్ అందజేశారు.

స్వయంపాలన దినోత్సవం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని చెంచుగూడెం సమీపంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

వెల్దండ: మండల పరిధిలోని రాఘయపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సరిహద్దుల వద్ద గ్రామస్తులు అష్ట దిగ్బంధం చేశారు. డబ్బువాయిద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి రాకపోకలను మూసివేశారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ శాంతకుమారి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి వేరువేరుగా బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అచ్చాలు, ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ సభ్యులు విజితారెడ్డి, సింగల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, గోరటి శ్రీనివాసులు, అంజినాయక్, రామస్వామి, మెండె బాలయ్య, వెంకటయ్య ఉన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై లేనిపోని రాద్ధాంతాలు, అభండాలు వేస్తున్నారని బీఆర్‌ఎస్ దళిత సంఘం నాయకులు శంకర్‌నాయక్, వెంకటయ్య, బాల్‌రాజు, గోపాల్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మన్ననూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మృతి చెందిన నిఖిత విషయంలో ఎమ్మెల్యే నిష్పక్షపాతంగా వ్యవహరించారని, ఆయన ఆదేశాల మేరకే రీపోస్టుమార్టం చేశారన్నారు. రాజకీయ లబ్ధికోసం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు.

ఎమ్మెల్సీ గెలుపుపై బీజేపీ సంబరాలు



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

కొల్లాపూర్: పట్టణంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బాణసంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు ఉపాధ్యాయులు ఓటు ద్వారా బుద్ధిచెప్పారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, భరత్‌చంద్ర పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతు ఇచ్చిన ఏవీఎన్ రెడ్డి ఘన విజయం సాధించడంతో శుక్రవారం బీజేపీ, ఏబీవీపీ, ఆర్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని పురవీధులలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మన్ననూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ బలపరిచిన ఏవీఎన్‌రెడ్డి గెలుపు బీఆర్‌ఎస్ పార్టీకీ సరైన గుణపాఠం చెప్పినట్లుగా ఉందని బీజేపీ జిల్లా కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, రమేష్ అన్నారు. పదర, అమ్రాబాద్ మండల కేంద్రాలతో పాటు మన్ననూర్‌లోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి ఆ పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ నాయకులు ఏవీఎన్‌రెడ్డి ఎమ్మెల్సీ గెలిచిన సందర్భంగా బీజేపీ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించి టపాసులు కాలుస్తూ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర, ఖలీల్, పరశురాం పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి గెలుపొందడంతో పార్టీ కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, నాయకులు రామస్వామి, రాజేందర్‌రెడ్డి, విష్ణుగౌడు, గణేష్ తదితరులు ఉన్నారు.

ఏపీజీవీబీపై కళాజాతా



కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని ఆదిరాలలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా ప్రదర్శన శుక్రవారం నిర్వహించినట్లు బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. ఏపీజీవీబీలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పింఛన్ యోజన, సైబర్ మోసాలు, క్రాప్‌లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్, మహిళా సంఘాల రుణాలపై మాటలు, పాటల ద్వార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సాయికుమార్, అకౌంటెంట్ అరవింద్, సభ్యులు విజయ్, చిరంజీవి, సాయి పాల్గొన్నారు.

ఘనంగా మహబూబ్‌సాని దర్గా గంధోత్సవం

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లిలో గురువారం రాత్రి మహబూబ్‌సాని దర్గా గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తుల కోలాహలం మధ్య గ్రామ సమీపంలోని యాపట్ల మార్గంలో ఉన్న దర్గా దగ్గరకు గంధాన్ని చేర్చారు. శుక్రవారం ఉదయం దర్గా దగ్గర ఫాతెహా జరిపారు. దర్గాలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెంచు సీనయ్య, ప్రజలు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను సాధించుకోవాలి

ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజ్



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్యేలు గువ్వల, జైపాల్‌యాదవ్

వెల్దండ: అంబేద్కర్ ఆశయాలను సాధించుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిమ్మినోనిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహన్ని జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఆశయసాధనకు యువత ముందుకు రావాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటయ్య, నాయకులు రామస్వామి, రాజు, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం



రైతులతో టీడీపీ నాయకుడు యాదిలాల్

కల్వకుర్తిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతామని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ యాదిలాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఇంటింటికి తెలుగుదేశంలో భాగంగా రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ పిలుపుమేరకు నియోజకవర్గంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వర్షానికి పంటలు దెబ్బతిన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నష్టపరిహారం చెల్లించకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు తిమ్మయ్య, వజ్రలింగం పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు గ్రీన్‌నెట్ అవసరం



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయసుధ

చారకొండ: నర్సరీల్లో పెంచే మొక్కల సంరక్షణకు గ్రీన్‌నెట్ ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. శుక్రవారం మండలంలోని జూపల్లి, తిమ్మాయిపల్లిలలో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో నర్సరీల వారిగా ఇచ్చిన టార్గెట్ ప్రకారం మొక్కలను పెంచాలన్నారు. అనంతరం గ్రామాల్లో పంచాయతీ రికార్డులను పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. కూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కూలీల హాజరు నమోదును ఎన్‌ఎంఎంఎస్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ వాస్‌దేవ్, టీఏ యాదయ్య, ఎఫ్‌ఏ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

వెల్దండ: ఉపాధి హామీ పథకం పనుల్లో కొలతల ప్రకారం కూలీలు పనులు చేస్తేనే గిట్టుబాటు కూలీడబ్బులు వస్తాయని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కంటోనిపల్లి, వెల్దండలలో ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కూలీలు వచ్చే విధంగా పనులను కొలతల ప్రకారం చేయాలన్నారు. ఉపాధి పనులను కూలీలందరికి ఉండేవిధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. వేసవి కావడంతో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు నీడ ఉండే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఫైయాజ్, టీఏ సత్యనారాయణ ఉన్నారు.

నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలి



వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాలలో ప్రాథమిక ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరిందని, వెంటనే నూతన భవనాన్ని నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి జి.అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని ఏఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ 150 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నారన్నారు. 1990లో పాఠశాల భవనాన్ని నిర్మించారని ఇప్పుడు ఆ భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడి పడుతున్నారని ఆరోపించారు. ఫలితంగా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించేందుకు విచారం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి నూతన పాఠశాల భవనానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శివరాం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న వీఓఏలు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మె 72 గంటలు అవుతున్న సందర్భంగా అందులో భాగంగా శుక్రవారం పట్టణంలో భిక్షాటన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమలత మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కనీస వేతనాలు అమలుచేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని తమకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోవడంతో కేవలం 3,600 వేతనంతో బతుకుబండి లాగిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఏఓల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, రామస్వామి, సుమతి, జులేక, మల్లేశ్, శశికళ, కుర్మయ్య, వెంకటయ్య, లక్ష్మయ్య, దేవయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో రాజకీయం



మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ: రాష్ట్రంలో నిరుద్యోగ యువత జీవితాలతో బీజేపీ రాజకీయం చేస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం వరుస ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తుండడంతో జీర్ణించుకోలేని బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాసులు, అంజినాయక్, సింగల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, సుభాష్, ధర్మనాయక్, శత్రునాయక్, శివకుమార్, రాజశేఖర్, శేఖర్, గోపి, ప్రశాంత్, గణేష్, చింటు మహేష్ ఉన్నారు.